ప్రజాశక్తి

మంగళవారం 16 జులై 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు



అధ్వానంగా పెదపలకలూరు రోడ్డు



ఆకులవారితోట వద్ద దెబ్బతిన్న కల్వర్టు

వర్షాలకు దుర్భరంగా రహదారులు

అస్తవ్యస్థ నిర్వహణతో ప్రజలకు అగచాట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులు దుర్భరంగా మారాయి. గత కొంత కాలంగా వీటి నిర్వహణ, మరమ్మతులు పట్టించుకోక పోవడంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఎక్కడ గుంత ఉందో..ఎక్కడ గొయ్యి ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గుంటూరు - పెదపలకలూరు మార్గంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పనులు గతమూడేళ్లుగా అదిగో.. ఇదిగో అంటూ ఆర్అండ్‌బి, కార్పొరేషన్ అధికారులు కాలయాపన చేశారు. తీరా ఆర్అండ్‌బి వద్ద నిధులు లేకపోవడంతో పనులు పూర్తి కావడం లేదు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడం వల్ల పేరేచర్ల వెళ్లే వాహనదారులు, వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణా లోపం వల్ల గ్రామీణ రహదారులు పంట పొలాలను తలపిస్తున్నాయి. కాల్వలల్లో మురుగునీరు బయటకు పోకపోవడంతోవర్షాలకు వర్షం నీరు,మురుగు కలిపి రోడ్లపైకి ప్రవహిస్తుండటంతో రహదారులు మరింత అధ్వానంగా మారాయి. గుంటూరు కార్పొరేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులు కూడా అన్ని దెబ్బతిన్నాయి. కల్వర్టులు దెబ్బతిన్నా మరమ్మతులు చేయడం లేదు. చాలా కాలంగా మరమ్మతులు లేక పోవడం, నిర్వహణపై పట్టించుకో కపోవడం, కొన్ని ప్రాంతాల్లో చేపట్టినపనులు అసంపూర్తిగా వదిలి వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు చేపట్టినపనులు ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు.ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులు దాటినా పనులు పునరుద్ధరించలేదు. వైసిపి హయంలో చేపట్టిన పనులు పూర్తి చేసేందుకు టిడిపి నాయకులు ససేమిరా అంటున్నారు. వీటిని రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలంటే మళ్లీ అంచనాలు పెరిగిపోతాయని అధికారులు అంటున్నారు. లేదా వీటినే కొనసాగిస్తే వారికి పేరు వస్తుందని టిడిపి వారు గుర్రుగా ఉన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు రూ.90 కోట్లపనులు పెండింగ్‌లోఉన్నాయి. కార్పొరేషన్‌లో వైసిపి నాయకులు తమ ఇష్టానుసారంగా పనులు కేటాయించుకుని టిడిపి కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలు, విలీన గ్రామాలను నిర్లక్ష్యం చేశారని ఇప్పటికే టిడిపి

▶ 2లో



జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ పునరుద్ధరించాలి : యుటిఎఫ్

పల్నాడు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద జిపిఎస్ గెజెట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగ ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పల్నాడు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం జిపిఎస్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరు ద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం జీపిఎస్ అమలు చేస్తామని ప్రకటించగా అనేక పోరాటాలు చేసి జీఓ విడుదల చేయనీయకుండా అడ్డుకున్నా మన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాకముందే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యా యులను గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్)లోకి తీసుకొస్తూ గత ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం ఈ నెల 12న జిఓ నెం. 54 విడుదల చేయడం పాత సీసాలో కొత్త సారా అన్న చందంగా ఉందని దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గత ప్రభుత్వంపై మూడున్నర ఏళ్లపాటు పోరాటం చేస్తే జిపిఎస్ పై ఒక అడుగు వెనక్కి వేసిందని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్

▶ 2ల



మాట్లాడుతున్న కలెక్టర్

ఇసుక సరఫరా సక్రమంగా చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర ఎస్ నాగలక్ష్మీ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో స్టాక్ పాయింట్ల నుంచి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధలకు విరుద్ధంగా ఇసుక సరఫరా, నిల్వ, ఎక్కువ ధరకు విక్రయించకుండా సంబంధిత శాఖల క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించటంతో పాటు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కేసులు నమోదు, పెనాల్టీలు విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక సరఫరాపై వచ్చిన ఫిర్యాదులను ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలన్నారు. రాయపూడి వద్ద డీ సిల్టేషన్‌కు మైన్స్, జియాలజీ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, రివర్ కన్జర్వేటర్ ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో పదిరోజుల్లో తనిఖీ చేసి నివేదిక అందించాలన్నారు. అదే విధంగా ఇతర డీసిల్టేషన్ పాయింట్‌లను పదిహేను రోజుల్లో

▶ 2లో

కామాంధునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

అభం, శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై బాలికను హత్య చేసినట్టు నేరం రుజువు కావడంతో నల్గొండ జిల్లా చందంపేట మండలం, కంబాలపల్లి గ్రామంలోని సరికల తండాకు చెందిన కేతావత్ బాలునాయక్ అనే కామాంధునికి జీవితఖైదు, రూ.21వేలు జరిమాన విధిస్తూ గుంటూరు పోక్సోకోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి కె.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్యామల ప్రాసిక్యూషన్ తరపున సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిందితుడు బాలునాయక్ గొర్రెల కాపరి. ఇతడు గొర్రెలు కాచేందుకు తరచూ మాచర్ల మండలంలోని కొత్తూరు గ్రామానికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో అతనికి కొత్తూరు గ్రామంలోని ఆచిన్నారి తండ్రితో పరిచయం ఏర్పడింది. 2018 మార్చి 22న ఉదయం 10 గంటలకు నిందితుడు బాలూ నాయక్ కొత్తూరు వచ్చి, ఆచిన్నారి తండ్రితో కలిసి కల్లు దుకాణానికి వెళ్లి మద్యం సేవించాడు. ఇద్దరూ కలిసి గ్రామంలోని ఒకరి ఇంట్లో కొలుపులు జరుగుతుండగా అక్కడికి వెళ్లి భోంచేసి, తిరిగి ఆ చిన్నారి తండ్రితో కలిసి వారి ఇంటికి వచ్చాడు. అక్కడ నిందితుడు బాలునాయక్ ఆచిన్నారి గురించి ఆమె తండ్రిని అడగగా అంగన్‌వాడీ స్కూలుకు వెళ్లిందని ఆమె తండ్రి చెప్పాడు. దాంతో బాలూనాయక్ స్కూలుకు దగ్గరలోని ఆచిన్నారి ఆడుకుంటున్న ప్రదేశానికి వెళ్లి బిస్కెట్లు కొనిపెడతానని చెప్పి గ్రామంలోని రైస్ మిల్లు వెనుక ఉన్న గడ్డివాము వద్దకు తీసుకువెళ్లి ఆచిన్నారిపై లైంగిక దాడికి పాల్పడటమేకాక ఆమెను హత్యచేసి

▶ 2లో



పల్నాడు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అచ్చంపేట మండలం తాళ్ళచెరువు గ్రామానికి చెందిన 100 మందికి పైగా రైతులు గత ఏడాది యుఎస్-450 మిర్చి విత్తనాలు వాడి నష్టపోయారని, వారిని అదుకోవడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన తాళ్లచెరువు రైతులతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ తాళ్ళచెరువు గ్రామంలో 100 మందికి పైగా రైతులు 250 ఎకరాల్లో యూఎస్ 450 మిర్చి విత్తనాలు సాగు చేశారని, కంపెనీ వారు చెప్పిన సమయానికి పంట రాకపోగా కంపెనీ వారిని, వ్యవసాయ,ఉద్యాన అధికారులను కూడా సంప్రదించడం జరిగిందన్నారు. అనంతరం కంపెనీ వారు, మరియు వ్యవసాయ అధికారులు పంట పొలాలు సందర్శించి కొంత ఆలస్యంగా పంట దిగుబడి వస్తుందని రైతులకు చెప్పడంతో ఆశతో దాదాపుగా 5 నెలలు పాటు పెట్టుబడులు పెట్టారని పూత , పిందె రాకపోవడంతో కంపెనీ వారిని నిలదీస్తే

▶ 2లో

రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

నష్ట పరిహారం చెల్లింపునకు రైతుల నుండి బ్యాంక్ విత్తన కొనుగోలు బిల్లులు, బ్యాంక్ ఖాతా వివరాలు జిరాక్స్, తీసుకొని నష్టపరిహారం ఇస్తామని ఇవ్వకుండా రైతు లను మోసం చేశారన్నారు. ప్రస్తుతం సాగుకు సమయం ఆసన్నమైన నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎకరాకు రూ 1 లక్ష నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్ పై చర్యలు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వారంలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అచ్చంపేట మండల కార్యదర్శి రావెళ్ళ వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు, బాధిత రైతులు ఏలూరు రత్తయ్య, టి సురేష్ రెడ్డి, నక్క వినీల్, గాదె ఇన్నారెడ్డి, కర్ల శివ, పి స్లీరా రెడ్డి తదితరులు ఉన్నారు.

కామాంధునికి జీవిత ఖైదు

(మొదటి పేజీ తరువాయి)

పరారయ్యాడు. ఈసంఘటనపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగార్జునసాగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సిఐడి సిట్ అడిషనల్ ఎస్పీ కేజీవి సరిత దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.విచారణ అనంతరం బాలునాయక్‌పై పలు సెక్షన్ల కింద నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు తో పాటు రూ.21 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఇసుక సరఫరా సక్రమంగా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించాలన్నారు. జిల్లాలో ఇసుక తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్న బోట్స్‌మెన్ సొసైటీల అర్హత ప్రమాణాలను ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం వెరిఫై చేయాలని, మాన్యువల్ త్రవ్వకాల ధరలపై ప్రతిపాదనలు తీసుకోవాలన్నారు. దుగ్గిరాల మండలం, పెదకొండూరులో సీజ్‌చేసిన 5,003 మెట్రిక్ టన్నుల నిల్వలను స్టాక్‌పాయింట్‌గా గుర్తించి విక్రయించటానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇసుక సరఫరా చేసే వాహనాలకు జిల్లా రవాణా శాఖ నిర్దేశించిన ధరలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ధరల వివరాలను ప్రతి స్టాక్‌యార్డులో ఫ్లెక్సీలు ప్రదర్శించటంతో పాటు, అక్కడ ఉద్యోగులకు ధరల వివరాలు అందించాలన్నారు.ఇసుక సరఫరాపై వినియోగదారుల నుంచి ర్యాండమ్‌గా ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. స్టాక్‌పాయింట్ వద్ద ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు వీలుగా కనీస మౌలిక సౌకర్యాల కల్పనపై మండల స్థాయి ఇసుక కమిటీ లో అమోదించి జిల్లా స్థాయి ఇసుక కమిటీకి అందిస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో శ్రీకర్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఉపరవాణా కమిషనర్ కరీం, పోల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నారాయణ, జిల్లా పంచాయితీ అధికారి శ్రీదేవి, అడిషనల్ ఎస్పీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-తాడేపల్లి :దుబాయ్, చెన్నై, మహారాష్ట్ర, బెంగుళూరు, కడప, వైజాగ్, హైదరాబాద్, నూజివీడు, రాజమండ్రి, విజయవాడ, మంగళగిరి, అమరావతి ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం కెసి వర్క్స్ హైస్కూల్లో జరిగింది. అందరూ ఒక చోట హాజరై పూర్వ విద్యార్థులు చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకుని పలచోట్ల స్థిరపడి మంచి ఉద్యోగాలు సంపాదించి ఒకచోట సమావేశం కావడం సంతోషంగా తమ మనోభావాలను పంచుకున్నారు. చదువుకునే రోజుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఉన్న సంబంధాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా టి.నాగేశ్వరరావు మాస్టార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మభూషణ్ కె.యల్.రావుకి ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

మాజీ కేంద్ర మంత్రి వర్యులు, ప్రముఖ ఇంజనీర్, పద్మభూషణ్ డాక్టర్ కె.ఎల్. రావు 122వ జయంతి సభ గుంటూరులో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి నేతత్వంలో జరిగిన 122వ జయంతి సభలో శాసనమండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ కె.ఎల్.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శాసనమండలి సభ్యులు కె. యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ 1963 లోనే డాక్టర్ కె.ఎల్. రావు సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మభూషణ్ గౌరవాన్ని అందించారన్నారు. మూడు వందలకు పైగా సాంకేతిక రచనలు చేసిన మేధావి అన్నారు. గ్రామీణ విద్యుదీకరణ కోసం అవిరళ కృషి చేశారన్నారు. గుంటూరు జిల్లాలో వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేయాలని గుంటూరు ఛానల్‌ను పొడిగించాలని కోరారు. నాటి ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహుదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ ప్రభుత్వాలలో నీటిపారుదల, జల వనరుల శాఖ కేంద్ర మంత్రిగా అవిరళ కృషి చేశారన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ డాక్టర్ కె.యల్.రావు భారతదేశంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, తుంగభద్ర, హీరాకుడ్,కోసీ, చంబల్, ఫరక్క లాంటి ఆనకట్టలను నిర్మించి హరిత విప్లవాన్ని సాధించిన మహనీయులని కొనియాడారు. 1962 నుండి 1977 వరకు విజయవాడ లోక్ సభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా కృషిచేసి ఆదర్శనీయమైన నేతగా గుర్తింపు పొందినారన్నారు. డాక్టర్ కె.ఎల్. రావు కృషికి గుర్తింపుగా పులిచింతల ప్రాజెక్టుకు డాక్టర్ కె.ఎల్. రావు పులిచింతల ప్రాజెక్టుగా నామకరణం చేశారన్నారు. మాజీ మంత్రివర్యులు



డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ విజయవాడలో దర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణం కె.ఎల్. రావు మేధా సంపత్తికి నిదర్శనమన్నారు. కె. యల్.రావు రచించిన ఇండియా వాటర్ వెల్త్ పుస్తకం ఇంజనీర్లకు ప్రామాణిక గ్రంథంగా వుందన్నారు. గంగా, కావేరి నదులను అనుసంధానం చేసే బహత్తర ప్రణాళికకు రూపకల్పన చేసిన మహనీయులన్నారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్, మానవత పూర్వ కార్యదర్శి ఎ. రమణ బాబు, మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, ఉప్పల సాంబశివరావు, టి. వి. సాయిరాం, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, పి. శేషుబాబు తదితరులు ప్రసంగించారు.

గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు లాలాపేటపోలీసులు తెలిపారు. అదనపు ఎస్పి నచికేట్ షెల్కీ స్థానిక లాలాపేట పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసినమీడియా సమావేశంలో మాట్లాడుతూ నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి గుంటూరులో విక్రయిస్తుండగా స్థానిక పీకలవాగు కట్ట డంపింగ్ యార్డు వద్ద అరెస్టు చేసి రెండు కేజీల సరుకు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. గుంటూరు నల్ల చెరువుకు చెందిన షేక్ కరీముల్లా, చల్లా ఈశ్వరరావు, బత్తుల శ్రావణ్ కుమార్‌తో పాటు మరో మైనర్ బాలుడ్ని కూడా అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు పంపారు. సిఐ దేవ ప్రభాకరరావు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వర్షాలకు దుర్భరంగా రహదారులు

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌పై పట్టు బిగించేందుకు టిడిపి నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కొత్త పనులు చేపట్టేందుకు నిధుల సమస్య కూడా వెంటాడుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో మళ్లీ వచ్చే బడ్జెట్ వరకు నిధులు వచ్చే అవకాశంలేదని అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయంలో మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. జిల్లాలో రూ.65 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్ళలో తగినన్ని నిధులు మంజూరు చేయకపోవడంతో రోడ్లకు మరమ్మతులు చేపట్టడం గుంతలు పూడ్చడం కూడా చేయలేకపోయారు.

మాచర్ల ప్రాంతంలో భారీ వర్షం

మాచర్ల : ఈ మధ్య కాలంలో చిరు జల్లులతో సరిపెడుతున్న వర్షం సోమవారం గంటన్నర పైగా కురిసింది. రైతులు సరైన వర్షం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో సోమవారం రోజున కురిసిన వర్షంతో రైతులు పూర్తి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు దుక్కి దున్ని విత్తు నాటేందుకు ఎదురుచూస్తున్న రైతులు ఆ దిశగా పనులు ప్రారంభిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ వర్షం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పట్టణంలో డ్రైనేజిలు సరిగా తీయక లోతట్టు ప్రాంతంలోని డ్రైనేజీలు పొంగి రహదారులపైకి మురుగు నీటి ప్రవాహం జరిగింది.

మురుగు కాల్వలు పారుదల లేక నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలంలో బుర్రిపాలెం సుందరయ్య చెరువు నుంచి రేపల్లె ప్రధాన డ్రైన్ వరకు మురుగు కాల్వలో పారుదల లేక వర్షపు నీరు పొలాల్లోనే నిలిచిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని బుర్రిపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక ద్వారా సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ కు రైతులు వినతి పత్రం అందజేశారు. దాదాపు 350 నుంచి 400 ఎకరాల్లో వర్షపునీరు పొలాల్లో నిలిచిపోయి వెద పద్ధతిలో నాటిన వరి చేలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వెంటనే మురుగుకాల్వలు పారు దలకు వ్యవసాయ చర్యలు చేపట్టాలన్నారు. పంట పొలాల్లో నీటి నిల్వలను కాల్వల్లోకి తరలించి రైతుల సమస్యను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పిం చారు. అంతేకాకుండా బుర్రిపాలెం ఎస్సి, ఎస్టి కాలనీలు కూడా ముంపుకు గురవుతున్నాయని తెలిపారు

ఒపిఎస్ పునరుద్ధరించాలి : యుటిఎఫ్

(మొదటి పేజీ తరువాయి)

లు జిపిఎస్ కంటే మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి మళ్ళీ జిపిఎస్ ని తీసుకురావడం ఉద్యోగ ఉపాధ్యాయులను మరోసారి మోసం చేయడమేనన్నారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరిస్తుంటే ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ తీసుకురావటం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల దగ్గర 10 శాతం కాంట్రిబ్యూషన్ తీసుకొని పెన్షన్లు ఇవ్వడం సభబు కాదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక శాఖ ఆమోదించిన 2003 డి.ఎస్.సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాల్సిందేనన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2004 ముందు తీసుకు వచ్చిన జీఓ నెం.57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేస్తుందన్నారు.యుటిఎఫ్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. మోహనరావుమాట్లాడుతు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా కాకముందే జిపిఎస్ అమలు చేసేందుకు రాజపత్రాన్ని విడుదల చేయడం జిపిఎస్ పాపం తమది కాదని గత ప్రభుత్వానిదని చెప్పడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ,జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిటర్ జి ఆంజనేయులు, నరసరావుపేట ప్రాంతీయ శాఖల బాధ్యులు ఓ కోటేశ్వరరావు,కె.వెంకటేశ్వరరావు, పి సత్యానంద్, ఎం.రామాంజి, షేక్ . షరీఫ్ అబ్దుల్ నయీమ్, కెవి.ప్రసాద్, జి.వెంకటేశ్వర్లు, ఎన్ సురేష్ కుమార్, అఖిబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రతులు దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు ప్రేమ్‌కుమార్ తదితరులు

రహదారి వేయాలని సిపిఎం అర్జీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక చెంచుపేట 29వ వార్డు కైలాస్ భవన్ రోడ్ రోడ్డుమార్గంలో పడేసిన షిల్ట్ తొలిగించాలని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ కు ప్రజా పరిష్కార వేదిక ద్వారా సోమవారం వినతి పత్రాన్ని సమర్పించినట్లు సిపిఎం తెనాలి ఏరియ కమిటి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ పేర్కొన్నారు. కాల్వల్లో తొలిగించిన పూడికను ప్రజలు సంచరిస్తున్న కాలిబాటకు అడ్డంగా వేయడం శోచనీయమన్నారు. పూడికను తొలగించకపోవడంతో అక్కడి నిర్వాసితులు దుర్గంధంతో అవస్థలు పడుతున్నా రన్నారు. దాదాపు 200 కుటుంబాలకు ఆ ప్రాంతంలో ఎప్పటినుంచో పక్కా రహ దారి లేకుండా పోయిందని వాపోయారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అక్కడ కాలిబాట పూర్తిగా బురదమయం అయ్యిందన్నారు. సైకిళ్ళు, ద్విచక్ర వాహనాలు, పాఠశాలలకు, కళా శాలకు వెళ్లే విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. సంబంధిత నిర్వా సితులకు పక్కా రహదారి నిర్మాణం చేపట్టాలని సంబధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని



విన్నవించామన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ శేషన్న ను సోమవారం ఫోన్ ద్వారా సంప్రదించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్ వలి పాల్గొన్నారు.

యడవల్లి దళిత,గిరిజన రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

యడవల్లి గ్రామంలో దళిత, గిరిజన రైతులు కోల్పోయిన భూములకు న్యాయమైన నష్ట పరిహారం ఇప్పించాలని సోమవారం జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజీని పండరీపురంలోని ఆయన నివాసంలో కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యడవల్లి రైతులు తమకు జరిగిన అన్యాయాన్ని బాలాజీకి తెలిపారు. అప్పటి జిల్లా కలెక్టర్ చంద్రయ్య వీకర్స్ కాలనైజేషన్ సొసైటీ క్రింద120 కుటుంబాలకు416 ఎకరాల భూమిని ఏకపట్టా క్రింద ఇచ్చారన్నారు. ఆ భూమిలో గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయని మైనింగ్ కోసం అని ప్రభుత్వం మా భూములను తీసుకున్నదని దానికి సంబంధించి నష్టపరిహారంగా న్యాయముగా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కనీసం ఎకరానికి రూ. 25 లక్షలు ఇవ్వాల్సి ఉండగా మాకు కేవలం ఒక్కొక్క ఎకరాకు రూ.8,33,300మాత్రమే ఇచ్చిందన్నారు. న్యాయమైన మా కోరికలను తీర్చమని గత రెండు సంవత్సరాలుగా పోరాటాలు, ఆందోళనలు చేస్తూనే ఉన్నామన్నారు. గత ప్రభుత్వంలో మాకు న్యాయం జరగకపోగా తీవ్ర ఇబ్బందులు గురయ్యమన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో వినతిపత్రం ఇస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి మాకు తగు నష్టపరిహారాన్ని ఇప్పించాలని లేకుంటే మా భూముల ను మాకు ఇప్పించాలని అన్నారు. ముఖ్యముగా 360 ఎకరాలకు గాను రూ.30 కోట్లు కేటాయించామని ప్రభుత్వం ప్రకటించిన కేవలం 223 ఎకరాలకు మాత్రమే మైనింగ్ ఇచ్చారని మిగిలిన భూమి సంగతేమిటో ఇంతవరకు ఏ అధికారి కూడా తేల్చడం లేదన్నారు. ఇప్పటికైనా మిగులు భూములను తేల్చి మాకు పంచాలని దళిత రైతులు కోరారు. అందుకు గాను బాలాజీ సానుకూలంగా స్పందించి దళిత రైతుల పలు సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే దిశగాకృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు వై రాధాకష్ణ, పల్నాడు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కారుచూల రోశయ్య, సిఐటియు పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయ నాయక్, సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, యడవల్లి దళిత రైతులు వేల్పుల వెంకటరావు, కాకాని రోశయ్య, సాంసంగ్, సామేలు, మల్లవరపు మరియ బాబు, వేల్పుల పవన్, కుమార్, తంగిరాల వెంకటస్వామి, కొమ్మాలపాటి శివ తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకులు బాలాజీకి వినతి పత్రం ఇస్తున్న యడవల్లి రైతులు, నాయకులు

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

పల్నాడుజిల్లా, యడ్లపాడు మండలం గ్రామ కాపురస్తుడు అయిన పారా కిషోర్ కుమారుడు గౌతమ్ అను నేను జూన్ 30వ తేదీన యడ్లపాడులోని మా ఇంటి నుండి మీ సేవ ఆఫీసుకు వెళ్ళే దారిలో డాక్యుమెంట్స్ వున్న సంచి పోయినది. అందులో 2016వ సం॥ జూన్ 18వ తేదీన సెటిల్‌మెంట్ దస్తావేజు వున్నది. ఎంత వెదికినా దొరకలేదు. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు తెలుపగలరు. తగిన బహుమతి ఇవ్వబడును.

ఇట్లు
పారా గౌతమ్, యడ్లపాడు.
సెల్ : 94403 84864, 9490643205.

దస్తావేజులు పోయినవి

గుంటు రఘు తండ్రి: సుబ్బారావు అను నా తాలూకు ఆస్తికి సంబంధించిన నం.2245/1980రు గల లింకు దస్తావేజును ఈనెల 10వ తేదిన నా ఇంటి వద్ద నుంచి ఫోటోస్టాట్ తీయించు నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయముసెంటర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. కావున దస్తావేజు దొరికిన వారు దయచేసి నాకు అందించగలరని మనవి. సదరు దస్తావేజును ఇప్పటి వరకూ ఏ బ్యాంకులో గాని, గిఫ్ట్‌గా గాని, తనఖాగా గాని, ఇతర ఫైనాన్స్ సంస్థలకు గాని, తాకట్టు గాని, హామీగా గాని పెట్టియుండలేదని తెలియజేయుచున్నాను.

అడ్రస్సు:
గుంటి రఘు, తండ్రి: సుబ్బారావు,
బ్యాంకు కాలనీ, చిలకలూరిపేట,
సెల్ నెం.9440474945.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్ట్
చిలకలూరిపేట
ఓ.ఎస్:05/2021

బిట్వీన్:
సత్తెనపల్లి మహంకాళయ్య ... వాది
V/S
1) కైపు తులసి కుమార్ S/o కృష్ణా రెడ్డి
2) కైపు కృష్ణ రెడ్డి S/o రోశి రెడ్డి
3) పార్లపల్లి వినీల W/o కైపు తులసి కుమార్
1 to 3 నెం. వారు R/o D.No: 25-10-132,
శ్రీనివాసరావుపేట, గుంటూరు స్థిర నివాసం.
..... ప్రతివాదులు

పై నెం. గల దావాలో మీరు 1 to 3 ప్రతివాదులు అయి ఉన్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పై నెం. గల దావాలో శ్రీ కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపినను మీరు బుద్ధి పూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెం.దావా ది. 31.07.2024 న వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా రోజున మీరు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై పై నెం. గల దావాలో మీకు గల ఆక్షేపణలను తెలియ పరచవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయటమైనది.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా:31-07-2024

ఇట్లు.
పోలూరు పాండురంగారావు,
పోలూరు పురుషోత్తమరావు,
పిటీషనర్ /వాది తరపున న్యాయవాదులు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, దాసరిపాలెం శివారు రామిరెడ్డిపాలెం గ్రామం తాలూకు నరసరావుపేట కాపురస్తుడు అయిన రాజనాల వెంకటేశ్వరరెడ్డి గారి కుమారుడు రాజనాల చిన వెంకటేశ్వర రెడ్డి గారి నుంచి సమాచారం పొంది యావన్మందికి తెలియజేయడం ఏమనగా. మా క్లయింట్ తాలూకు దస్తావేజు నెం.670/2021 రుగా గల దస్తావేజు నరసరావుపేట కోట సెంటర్ నందు జిరాక్స్ తీసుకునే క్రమంలో ఎక్కడో జారి పోవడం జరిగింది. ఎంత వెతికినా కనిపించలేదు సదరు విషయమై నరసరావుపేట 2 టౌన్ పోలీసు వారికి ఫిర్యాదు చేసియున్నాము. ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింద తెలిపిన అడ్రసు తెలియపరచగలరు.

ఈ దస్తావేజు ద్వారా ఎవరైనా ఏ విధమైన లావాదేవిలు జరిపిన యెడల అట్టి లావాదేవిలు అన్నియు నా క్లయింటు ఏవిధంగా బద్దుడను చేయ జాలనవి ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది. అట్టి ఆస్తి విషయములో ఏవైనా పేచీలు సమస్యలు అభ్యంతరములు ఉన్నచో వెంటనే మరియు ఎవరైనా అలా రిజిస్ట్రేషన్ చేసే యెడల మా క్లయింటు తీసుకోబోవు అన్ని రకముల సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని మరియు ఎవరికైనా సదరు ఆస్థికి సంబంధించిన అగ్రిమెంట్లు గానీ, స్వాధీన, అస్వాధీన పత్రములు గానీ మరి ఏ ఇతరమైన పత్రాలు ఎవరి వద్దనైనా ఉన్న యెడల ఈ దిగువ అడ్రస్సుకు తెలియపర్చగలరు. లేని యెడల సదరు ఆస్థిని మా క్లయింటు యధేచ్ఛగా ఇతరులకు విక్రయించుటకు సిద్ధముగా యున్నాడు. కావునా ఉన్న వాస్తవమైన విషయములను యావన్మందికి తెలియజేయడమైనది.

ఇట్లు,
సింగం చంద్రశేఖర్, వై సురేష్ బాబు,
డి. మస్తానయ్య, అడ్వకేట్స్
ప్రకాష్ నగర్ , నరసరావుపేట.
సెల్ : 95734 27200, 98665 63697, 81792 61369.

మహారాజశ్రీ 11వ అదనపు జిల్లా జడ్జి : తెనాలి
ఈ.పి. 52/2022 ఇన్ ఓ.యస్.386/2012

బిట్వీన్:
కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి .....డి. హెచ్.ఆర్
ఎదిరి
తానిగుండాల లక్ష్మీ మరియు ఇతరులు ... జె.డి.ఆర్స్.
1. తాని గుండాల లక్ష్మీ (1వ జె.డి.ఆర్)
భర్త జయప్రకాష్ రెడ్డి (లేటు)
2. తానిగుండాల ఉదయ ప్రకాష్ రెడ్డి (2వ జె.డి.ఆర్)
తండ్రి జయప్రకాష్ రెడ్డి (లేటు)
1, 2, వారలు డోర్ నెం.20-8-9/7, సాయిబాబా గుడి వద్ద, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.
3. తానిగుండాల ప్రియాంక తండ్రి విజయకుమార్ రెడ్డి డోర్ నెం. 1-10-19, చెరువు వారి వీధి,
నాజరుపేట, తెనాలి.

సదరు ఈ.పి. నందు మీరు 1,2,6 జె.డి.ఆర్స్ అయి వున్నారు. సదరు పై ఈ.పి 11వ అదనపు జిల్లా కోర్టు నందు ఓ.యస్ నెం.386/2012 నందు వున్నటువంటి సొమ్మును జప్తు చేయు నిమిత్తము మీపై పై తెల్పిన ఈ.పి. పెండింగులో వున్నది. దరిమిలా సదరు ఈ.పి.లో మిమ్ములను 1, 2, 6వ జె.డి. ఆర్స్ అయిన మీకు కోర్టు వారు నోటీసులు పంపినను తీసుకొనక, జారీ అవ్వక, కాలయాపన జరుగుచున్న ందున సదరు కోర్టు వారి ఆర్డరు ప్రకారం 1, 2, 6 జె.డి.ఆర్ పై ఆర్డర్ 21, రూల్ 52 నోటీసు మీకు పేపరు ప్రకటన ద్వారా కోర్టు నోటీసు ది. 19-07-2024 వాయిదా గలదని తెలియజేయడ మైనది. సదరు వాయిదా ది.19-7-2024న 1, 2, 6 జెడి.ఆర్గ్ అయిన మీరు కాని, లేక మీ అడ్వకేట్ గారి ద్వారా గాని పె తెల్పిన కోర్టులో ఉదయం 10-30 ని॥లకు హాజరు కావలెను, కానిచో మిమ్ములను కోర్టు వారు పిలిచి మీ పరోక్షమున ఈ.పిని తీర్మానించి తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడునని ఇంద మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది. 19-07-2024

యమ్.ఏ.హమీద్ బేగ్,
వాది తరపు న్యాయవాది,
తెనాలి **తెనాలి.**

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్. 61/2022

బిట్వీన్ :
యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆంధ్రాబ్యాంక్)
మెయిన్ బ్రాంచి, సత్తెనపల్లి ..... వాది
మరియు
1) షేక్ మహమ్మద్ రఫీ
2) మల్లాల రాంబాబు ... ప్రతివాది
ఒకటవ ప్రతివాది చిరునామా :
షేక్ మహమ్మద్ రఫీ, తండ్రి : మీరావలి, డోర్ నెం. 20-2-74/3, వెంకటపతి కాలనీ, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై దావాలో వాది అయిన బ్యాంకు వారు మీపై మీరు తీసుకున్న రుణం వసూలు నిమిత్తం దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపియున్నను మీరు తీసుకోకుండా త్రిప్పి పంపుచూ కాలయాపన చేయుచున్నారు. కావున పై దావాను కోర్టువారు ది. 29-7-2024వ తేదీన మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా దావా వాయిదా వేసియుఆన్నరు. కావున మీరు ఆ రోజున ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారు ఎదుట మీరు స్వయంగా గానీ, లేదా ప్లీడరు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలసి వున్నది. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానించబడును. కావున ఇందుమూలంగా మీకు తెలియచేయటమైనది.

వాయిదాతేది : 29-07-2024

ఇట్లు
సిహెచ్.చిన సత్యనారాయణ, ఎం.ఎ., బి.ఎల్.,
సత్తెనపల్లి. **అడ్వకేట్, సత్తెనపల్లి.**
ది.13-7-2024

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి
(సీనియర్ డివిజన్)
ఐ.పి. నెం. 29/2022

బిట్వీన్:
యారవ శ్రీలక్ష్మి ....వాది
వర్సెస్
షేక్ బాజిబి మరియు వగైరాలు .... ప్రతివాదులు
టు,
ఆర్8) అవుతు రత్న, భర్త : శ్రీనివాసరెడ్డి, ఆర్/ఓ, ప్లాట్ నెం. 302, 3వ ఫ్లోర్, భాష్యం బ్లూమ్స్ ఎదురు, సాయిబాబు రోడ్డు, గుంటూరు.

పై ఐ.పి. నెం.29/2022లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను పలుమార్లు పంపించినన్నూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 23-7-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపనలను తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 23-7-2024

బొల్లిముంత విజయ్‌కుమార్,
పిటీషనర్ తరపు అడ్వకేట్, తెనాలి.
తెనాలి **సెల్ : 94408 53217.**

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. నెం. 143/2022

బిట్వీన్:
బండి పిచ్చిరెడ్డి .... ప్లెయింటిఫ్ / వాది
వర్సెస్
వేముల కోటేశ్వరరావు, తండ్రి : చిన అంకులు, హిందు, 47 సం॥లు, వ్యవసాయం పిల్లుట్ల గ్రామం, మాచవరం మండలం, పల్నాడుజిల్లా.
.... డిఫెండెంట్ / ప్రతివాది

పై తెలిపిన నెంబరు దావాను ప్లెయింటిఫ్/ వాది దావా ప్రామిసరీ నోటు వడ్డీతో సహా బాకీని డిఫెండెంట్ / ప్రతివాది అయిన మీ నుండి రాబట్టు నిమిత్తం పై తెలిపిన కోర్టులో దాఖలు పరిచి పలుమార్లు మీకు కోర్టు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయడమైనది. పై దావాలో మరియు ఐ.ఎ. నెం. 292/2022 వాయిదా : 25-7-2024 తేదీన ఉదయం 10-30 గం.లకు సదరు కోర్టులో మీరు స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు కావలసినదిగా తెలియపరచట మైనది. లేనిపక్షంలో పై వ్యవహారములు మీకు పరోక్షంగా తీర్మానం చేయబడును.

వాయిదాతేది : 25-7-2024

ఆతుకూరి శీతారామయ్య,
వాది తరపు న్యాయవాది.

చిన్న పరిశ్రమలకు చేయూత

ప్రజాశక్తి-తాడేపల్లి

చిన్న పరిశ్రమలకు టిడిపి ప్రభుత్వం చేయూత నందిస్తుందని పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు హామీనిచ్చారు. తాడేపల్లి పట్టణంలోని ఐఒసి సమీపంలో ఇండస్ట్రియల్ ఏరియా సమీపంలో చిన్న పరిశ్రమల సొసైటీ సభ్యులు ఇటీవల ప్రజాదర్బార్‌లో తమ సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. తమ సొసైటీ పరిధిలోని పరిశ్రమలకు సంబంధించి విద్యుత్ సౌకర్యం, మంచినీరు, రోడ్లు లేక ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన లోకేష్ ఆ ప్రాంతంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని వెంకట్రావుకు సూచించారు. ఆ మేరకు సోమవారం విద్యుత్ అధికారులు ఇండస్ట్రియల్ కాలనీలో పర్యటించారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దీనిపై సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 21వ తేదీ మంగళగిరి, తాడేపల్లి రజక వృత్తిదారుల మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా సోమవారం వివిధ ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం బిసి తరగతులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇ.శ్రీనివాసరావు, నరసింహారావు, శ్రీను, బాబూరావు పాల్గొన్నారు.

మద్యం తాగి నిప్పంటించుకున్న యువకుడు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

అచ్చెంపేట మండలం బల్లాయిపాడుకు చెందిన దాసరి లక్ష్మీనారాయణ అనే యువకుడు మద్యం మత్తులో వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ లో ఆదివారం రాత్రి జరిగింది. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాపాలదారుడు మనుమరాలు పుట్టినరోజు వేడుకలకు వచ్చిన లక్ష్మీనారాయణ యువకులతో కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్నేహితులు తీవ్రంగ గాయపడిన లక్ష్మీనారాయణ ను సత్తెన పల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య కోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE
XXVI ADDL. CHIEF JUDGE,
CITY CIVIL COURT, AT: HYDERABAD
O.P.No. 39 OF 2020

Between:
V. Sujatha and Others
...Petitioners
AND
A. Sudheer and Others
...Respondents

To,
R-1: A. Sudheer, S/o. Krishna, Aged: Major, Occ: Driver, R/o. H.No. 14-9-38, Netajinagar, Ponnuru, Guntur District-522124. Andhra Pradesh State.

NOTICE

Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondent No. 3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same.

The case is posted on the day of 08-08-2024 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH,
K. RANJITH KUMAR,
Advocates,
H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad.
Cell: 9866611022



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	29,930
మిర్చి ఎగుమతి	:	26,747
మిర్చి నిల్వ	:	15,530

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 16,000
నెం.5	12,500 - 14,000
273	11,500 - 11,500
341	9,500 - 15,500
నాన్ ఎసి	
తేజ	8,500 - 18,000
బడిగి	8,500 - 15,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
తాలుకాయలు	4,000 - 12,000
ఎసి	
334	10,500 -16,000
నెం.5	11,200 -11,200
273	12,500 - 12,500
341	13,500 - 17,000
తేజ	12,500 - 18,000
బడిగి	11,000 - 14,500
దేవనూరు డీలక్స్	9,000 - 11,000
తాలుకాయలు	5,500 - 10,500



నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

సంక్షేమ పథకాల అమలకు అడ్డంకిగా ఉన్న మెమో 1214 రద్దు చేయండి

భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో నెం. 1214 రద్దు చేసి నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని పల్నాడు భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద రావు అన్నారు. సోమవారం రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ఫెడరేషన్(సిఐటియు) పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు భవన,ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సం క్షేమ పథకాలను గత ప్రభుత్వం అన్యాయంగా కక్షపూరితంగా నిలుపుదల చేసిందని, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క నయా పైసా కూడా ఖర్చు కాదని భవన నిర్మాణదారులు ఇచ్చే ఒక శాతం సెస్సు, కార్మికులు దాచిపెట్టుకున్న నిధి వీటితోనే సంక్షేమ బోర్డు నడుస్తుందని, భవన నిర్మాణ కార్మికుల డబ్బులను రాష్ట్ర ప్రభుత్వాలు వాడుకుంటూ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు.

ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ,సంక్షేమ పథకాలన్నీ తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ 2019 కి ముందు దరఖాస్తు చేసుకున్న వేలాది క్లయిమ్ లు కార్మికులకు అందకుండా బకాయిలు ఉన్నాయని వాటన్నింటినీ తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని, 2019 తర్వాత దరఖాస్తులు చేసుకున్న కార్మికులందరికీ పెళ్లి కానుకలు, ప్రసూతి సహాయాలు, సహజ ప్రమాద మరణాలు, తాత్కాలిక అంగవైకల్యం, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ల ద్వారా ఇచ్చే స్టైపండు తదితర సంక్షేమ పథకాల ద్వారా పల్నాడు జిల్లా వ్యాప్తంగా రూ 3.50 కోట్లు బకాయిలను తక్షణమే ఇప్పించాలన్నారు.

ఇసుక ఉచితమని ప్రకటించినా ధరలు నామ మాత్రంగానే తగ్గాయన్నారు. ఇసుకపై జిఎస్టీ ఎత్తి వేసి కృష్ణానది పరివాహ ప్రాంతం లోని అన్ని మండలాలలో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని, సమగ్రంగా ఉచిత ఇసుక విధానాన్ని రూపొందించి పేద నిర్మాణదారులను ఆదుకొని నిర్మాణ కార్మికుల ఉపాధిని పెంచాలని, ఉచిత ఇసుక విధానములో బ్లాక్ మార్కెట్ ను నిరోధానికి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని, సంక్షేమ బోర్డు కు జమ కావలసిన సెస్సు డబ్బులను సక్రమంగా వసూలు చేసేటట్లు కార్మిక శాఖ అధికారులకు తగు బాధ్యతలు అప్పజెప్పాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయ కులు కొమ్ముల సురేష్, రామిశెట్టి ఆంజనేయులు, బత్తుల కొండలు,చిలక చిన్న యేసు, వెంకటప్పయ్య, బత్తుల బాలకోటయ్య, బత్తుల అప్పారావు, సత్తెనపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి. మహేష్, పి ఆదినారాయణ, వి.బాలస్వామి, సిహెచ్ కొండలు, యస్.వెంకట్రావు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకంలు ఫిర్యాదులు స్వీకరించారు. నేటి కార్యక్రమంలో 96 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు శ్రద్ధ, అంకిత భావంతో పని చేయాలని, జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్కరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టల్లో, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీలు చేసి, సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు కింద స్థాయి సిబ్బందిని సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు.

వంద శాతం వికలాంగురాలిని.. పెన్షన్ ఇచ్చి ఆదుకోండి



ప్రభుత్వం వంద శాతం వికలాంగులకు ఇస్తామన్న రూ.15 వేల పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని వినుకొండ పట్టణానికి చెందిన వికలాంగురాలు నాగ శ్వేత విజ్ఞప్తి చేశారు. పుట్టుకతోనే తాను మంచానికి పరిమితమయ్యానని, తప తల్లి 27 ఏళ్లుగా తనకు సపర్యలు చేస్తోందని, పెరిగిన కుటుంబ ఖర్చులతో కుటుంబ పోషణ భారంగా ఉందని తెలిపింది.

అరకపోయే బాట కబ్జా చేసి పొలంలోకి వెళ్లనీయట్లేదు



యాభై ఏళ్ల క్రితం తమ పెద్దలు కొనుగోలు చేసిన 1.90 సెంట్లు భూమి, వారి తదనంతరం తమ ఆధీనంలో ఉందని,అరకబోయే బాట ఉన్నప్పటికీ ఆ బాటను పొలంలో కలిపేసుకున్న ఉసిల్ల బాలమూర్తి తమ పొలంలోకి తమను రెండేళ్లుగా వెళ్ళ నీయడం బొల్లాపల్లి మండలం వెల్లటూరుకి చెందిన దాసరి చినపేరయ్య ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామ పెద్దలు జోక్యం చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుతం వ్యవసాయ పనుల నేపథ్యంలో వెళ్లేందుకు బాట సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు.

అదనంగా ఇస్తామన్న పరిహారమివ్వట్లేదు



చీరాల - నకరికల్లు ఓడరేవు రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం తమ భూములను కొనుగోలు చేసిందని అయితే చిన్న సన్నకారు రైతులకు ఇచ్చే పరిహారం సాధారణ పరిహారం కంటే 30 శాతం అదనంగా ఇస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన జాయింట్ కలెక్టర్, రెవెన్యూ అధికారులు 6 నెలలు గడుస్తున్నప్పటికీ పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని బొప్పూడికి చెందిన దాసరి చౌడయ్య ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. మొత్తం 12 మంది బాధితులు ఉన్నట్లు తెలిపారు.

పొలం, స్థలం వైసిపి నాయకుల కబ్జా



పెద్దల నుండి వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిలో 15 సెంట్లను గ్రామ సమీపంలోని ఒక సెంటు స్థలాన్ని గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు సోమిశెట్టి సాంబశివరావు తదితరులు కబ్జా చేశారని ఈపూరు మండలం బొగ్గరం గ్రామ టిడిపికి చెందిన సందేశి ఆంజనేయరాజు ఫిర్యాదు చేశారు.ఈ విషయం గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.

22 ఏ నుండి తమ భూమిని తొలగించండి

బాపట్ల జిల్లా కర్లపాలెం గ్రామానికి విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి 1991లో మండల కేంద్రం ముప్పాళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన 3.13 సెంట్ల సాగు భూమిని 2002లో బిల్ కాంట్రాక్టుగా కొనుగోలు చేయగా దీనికి సంబంధించి అన్ని పత్రాలను సంతకాలతో సహా విశ్రాంత ఆర్మీ ఉద్యోగి అప్పజెప్పారని దీనిపై ఎటువంటి వివాదాలు లేవని, పొలాన్ని 22ఏ నుండి తొలగించాలని రెవిన్యూ అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదనిమండల కేంద్రం ముప్పాళ్లకు చెందిన ఒంటిపులి కాటి అంకమ్మ వేడుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి అశోక్ తన పొలాన్ని కాజేయాలని చూస్తున్నారని తనకు అనుమానంగా,తమకు న్యాయం చేయాలని కోరారు.

జగనన్న కాలనీల పేరు అంబేద్కర్ కాలనీగా పేరు మార్చండి



గత ప్రభుత్వం పేదల కోసం ప్రజాధనంతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలకు కూటమి ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్ అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. నరసరావుపేట పట్టణం బాపనయ్య నగర్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని గ్రంథాలయం ఏర్పాటు,ఆ ప్రాంతంలో 20 ఏళ్ల పైబడి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న 120 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, 11,12,13 వార్డుల సచివాలయాలు ఒకే ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో ప్రజా అవసరాల నిమిత్తం మీసేవ కేంద్రం ఏర్పాటు,4500 ఓటర్లు ఉన్న 12వ వార్డులో రేషన్ బియ్యం వార్డులోనే సరఫరా చేయాలని కోరారు. ధర్నా చౌక్, అంబేద్కర్ భవనం కోసం స్థలం తదితర సమస్యలపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు.



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని విడిపించి పేదలకు ఇవ్వండి

నూజెండ్ల మండలం తలారులపల్లెలో 646/4, 682 లలోని 177 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వినుకొండకు చెందిన పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి పై ప్రభుత్వం చర్యలు తీసుకొని, భూములుస్వాధీనం చేసుకొని దళితులకు పంచాలని పిడిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా అనంతరం అర్జీ అందజేశారు. ప్రస్తుతం ఆ భూమిలో చేపల చెరువులు, జామాయిల్ తోటలు ఉన్నాయని గతంలో దాట్లవారిపాలెం గ్రామ దళితులు సాగు చేసుకుని జీవించేవారని వారు వలస పోవడాన్ని ఆసరాగా చేసుకొని ఏర్పాటు చేసిన చెరువులు, జామాయిల్ తోటలు స్వాధీనం చేసుకుని గ్రామ దళితులకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎమ్ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, పిడిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్వలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటా నాయక్,బిసి నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, దాట్లవారిపాలెం గ్రామ దళితులు పాల్గొన్నారు.



డొంక రోడ్డు ధ్వంసం, ఆక్రమణపై రైతుల ఫిర్యాదు

ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పొలాలకు వెళ్లే డొంక రోడ్డును ఎవరి పొలాలు ఎదురు రైతులు కలుపుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని దీనిపై ఆ రైతులను ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని చివరి భూముల రైతులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. గత ఏడాది జాయింట్ కలెక్టర్, నకరికల్లు తహశీల్దారులు సర్వే చేసి 5.18 సెంట్ల పొలిమేర బాటలో డొంక రోడ్డు పోయించారని దానిని మళ్ళీ రైతులు తమ పొలాల్లోకి బాటను



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

కలిపేసుకుని పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా ఆటంకం కలిగిస్తున్నారని నకరికల్లు మండలం త్రిపురాపురం గ్రామానికి చెందిన బోయిన అంబారావు, చెంచమ్మ, రామయ్య, అల్లూరి మాణిక్యమ్మ,మద్దం శ్రీను తదితర రైతులు న్యాయం చేయాలని వేడుకున్నారు.



డంపింగ్ యార్డును తరలించండి

గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో నరసరావుపేట పట్టణ సమీపంలో ఎస్ ఆర్ కేటి కాలనీ వద్ద ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించాలని సిపిఐ నాయకులు కలెక్టర్‌కు వినతి త్రం అందజేశారు రహదారి పక్కనే డంపింగ్ యార్డ్ ఉండడంతో నిత్యం పొగ చెత్తాచెదారం ధూళి రోడ్డు పైకి వస్తుందని ఆ సమీపంలో ఉండే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-పెదకూరపాడు



ఇళ్ల లైను ఏర్పాటు చేయాలని స్థానిక సాయి బాబా గుడి ప్రాంత వాసులు కోరారు. సోమ వారం పరిష్కార వేదికకు తహ శీల్దార్ ప్రభాకర్ రావుకు వినతిపత్రం అందించారు. ఆ ప్రాంతంలో 20 నివాస గృహాలు ఉన్నా యన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు తెలియజేస్తామని తహశీల్దార్ తెలిపారు.

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

మండల విద్యాధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మండల విద్యాధికారులను ఆదేశించారు. పని చేయని ఆర్వో ప్లాంట్లకు వెంటనే మరమ్మతులు చేయించి అన్ని పాఠశాలల్లోని ఆర్వో ప్లాంట్లను ఉపయోగంలోకి తీసుకురావలన్నారు. ఆర్వో ప్లాంట్లు లేని పాఠశాలల్లో మినరల్ వాటర్ సం ఫరా చేయాలన్నారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్ లో ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం-తాగునీటి నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యం విషయాల్లో రాజీ పడొద్దన్నారు. ఎక్కడైనా విద్యార్థులలో అస్వస్థత లక్షణాలు కనిపిస్తే స్థానిక ఏఎన్ఎమ్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. మెనూ ప్రకా రం భోజనం అందించే విషయంపై ఏజెన్సీలు, ప్రధానోపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, ఈ ఏడాది జిల్లాలో 80 శాతం మందికి పైగా పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రతి ఎంఈవో ప్రభుత్వ పాఠశాలలతో పాటూ ప్రైవేటు పాఠశాలల్లోనూ తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈవో వెంక టేశ్వర్లు, ఎంఈవోలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం క్రింద జులై 18వ తేది నుండి ఆగస్టు 2వ తేది వరకూ నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మొదటగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో పాటు ఒక పురుష సచివాలయ ఉద్యోగిని టీమ్‌గా ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ వెళ్ళి సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఇందుకు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

గాను సమన్వయ కమిటీ అధికారులు మండల, జిల్లా అధికారులు తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై రూపొందించిన ప్రచార పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగ రాజు, డిఆర్ఓ పెద్దిరోజా, ఆర్డీఓ పి.శ్రీఖర్, డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్, పి.ఉమా దేవి, జెడ్పీ డిప్యూటి సిఈఓ మోహన్‌రావు, డియం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, జిజిహెచ్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణబాబు, జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల పరిహారం తక్షణం అందజేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య

ప్రజాశక్తి దుగ్గిరాల

65 కోట్ల రైతు కుటుంబాలకు కనీసం లక్షన్నర కోట్లు కేటాయించలేని ప్రభుత్వం ఆదాని అంబానీలకు లక్షలాది కోట్ల రూపాయలు కట్టబెడుతుందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య విమర్శించారు. మండల కేంద్రం దుగ్గిరాల లోని టర్మరిక్ అసోసియేషన్ హాలులో వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రావాల్సిన రెండున్నర లక్షల కోట్లు పారిశ్రామికవేత్తలకు వెళ్తున్నాయని విమర్శించారు. మానవాళిని అన్నం పెట్టే వ్యవసాయం బతకాలంటే రైతు పెట్టుబడి పై 50 శాతం అదనంగా పెంచి పంట ధర నిర్ణయించాలన్నారు. వెంటనే గుర్తింపు కార్డులు ఇచ్చి రైతు భరోసా వర్తింప చేసినట్లయితే వ్యవసాయానికి ఉపయోగపడుతుందన్నారు. రైతులకు రావలసిన పాత బకాయిలు చెల్లించాలని కోరుతూ 2022- 23, 23- 24 సంవత్సరాలలో రబి పంట నష్టపోయిన రైతులకు వెంటనే బీమ ప్రీమియం చెల్లించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామీ పనులు 200 రోజు లకు పెంచాలన్నారు. అగ్ని ప్రమాదానికి గురైన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంట పెట్టి నష్టపోయిన రైతులకు ప్రశాంతత లేకుండా పోయిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు సమక్షంలో క్వింటాకు రూ.7000 నష్టపరిహారం బీమా కంపెనీ నుండి వస్తుందని ఒప్పందం కుదిరినప్పటికీ ఎప్పటికి వస్తుందో క్లారిటీ లేదన్నారు. దీని కొరకు ఈనెల 18న జాయింట్ కలెక్టర్ ను కలుస్తామని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం అంగీకార పత్రం ఇచ్చినట్లయితే నష్టపరిహారాన్ని రైతు ఖాతాలో జమ చేసే అవకాశం ఉందని తెలిపారు. రైతు సంఘాలు పార్టీలకు అతీతంగా పనిచేయాలని



సమావేశంలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

పిలుపునిచ్చారు. దేశంలోని రైతు సంఘాలు ఢిల్లీలో కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ 15 సెంట్లు స్థలం కేటాయించిందని తెలిపారు. రాష్ట్రాల వారిగా నిధులు వసూలు చేస్తున్నారని మన రాష్ట్ర రైతు సంఘాలు రూ.10 లక్షలు చెల్లించినట్లయితే కార్యాలయంలోని ఒక బ్లాకుకు పుచ్చలపల్లి సుందరయ్య పేరు పెడతామన్నారని, అందుకోసం తమ వంతు సహాయ సహకారాలు అందించవలసిందిగా రైతులకు కోరారు. కార్యక్రమంలో పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు, కమిటీ సభ్యులు ములక శివ సాంబి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు, రైతు సంఘం మండల అధ్యక్షులు బి అమ్మిరెడ్డి మండల నాయకులు యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు రైతులు నాదెండ్ల చంద్రశేఖర్ ఆళ్ల వెంకటప్ప రెడ్డి పడుచూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెమ్మసాని జోక్యంతో రైళ్ల పునరుద్ధరణ

స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైల్వే ప్రయాణికుల ఇక్కట్లను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఒక్క లేఖతో పరిష్కరించారు. గూడూరు-విజయవాడ, విజయవాడ-గూడూరు మీదుగా ప్రయాణించే రెండు రైళ్ల రాకపోకల రద్దును రైల్వే అధికారులతో మాట్లాడి తక్షణమే అందుబాటులోకి వచ్చేలా చేశారు. నూతన రైల్వే లైన్ నిర్మాణం, రైల్వే సిగ్నలింగ్ ఆధునీకరణ నేపథ్యంలో ఇటీవలే 25 ప్యాసింజర్ ఎక్స్ ప్రెస్ రైళ్ళను రద్దు చేస్తున్నట్లుగా రైల్వే శాఖ ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా గూడూరు-విజయవాడ, విజయవాడ - గూడూరు మీదుగా రాకపోకలు సాగించే రెండు రైళ్ళను కూడా దక్షిణ మధ్య రైల్వే అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో ఒంగోలు-బాపట్ల-తెనాలి మీదుగా విజయవాడకు నిత్యం ప్రయాణించే కార్మికులు, ఉద్యోగస్తులు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు కేంద్ర సహాయ మంత్రి సోమవారం నాడు లేఖ రాశారు. డాక్టర్ పెమ్మసాని జోక్యంతో రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తక్షణమే స్పందించారు. విజయవాడ- గూడూరు, గూడూరు-విజయవాడ మార్గం గుండా ప్రయాణించే 12734, 12733 రైళ్ళను పునరుద్ధరిస్తూ సోమవారం సాయంత్రానికి ఆదేశాలు జారీ చేశారు. రైళ్ల రద్దుతో స్తంభించిన ప్రయాణాలు ఈ ఆదేశాలతో మళ్లీ ముందు కు కదలడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు సమస్యలను పట్టించుకోండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యేలు మాధవి, నశీర్, రామాంజనేయులు వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించాలని ముగ్గురు ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు కార్పొరేషన్ అధికారుల తీరుపై వారు



సోమవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి, తాను అనేక డివిజన్ లలో పర్యటించి ప్రజాసమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆశించిన ఫలితాలు రావటం లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. నియోజకవర్గములో రోడ్లు, డ్రైన్లు మరియు కల్వర్టు మరమ్మతుల సమస్య ఉన్నదని ప్రధానంగా పీకలవాగుకు మీద కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా తయారయ్యని, గతంలో ఈ పీకల వాగులో పడి ఓ బాలుడు కూడా కొట్టుకొని పోయాడని వెంటనే పీకలవాగు మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజి వ్యవస్థ, రోడ్ల ప్యాచ్ వర్కులు నిర్వహించాలని, చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని, అదే విధముగా నగరంలో కుక్కల బెడద అధికంగా ఉన్నదని, ఇవి ప్రజల మీద దాడులకు పాల్పడుతున్నాయని వెంటనే కుక్కల బెడదను అరికట్టాలని, వీటన్నటి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కలెక్టర్ దృష్టికి తీసుకొనివెళ్ళారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియో జకవర్గంలో ప్రతిరోజు ప్రజలు వివిధ సమస్యలతో ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలుస్తున్నారు. వీటి పరిష్కారానికి ఖచ్చితముగా కషి చేసి వారికి అండగా ఉంటానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యలయంలో ప్రజల నుండి ఆమె వినతులు స్వీకరించారు.ఈ



సందర్భముగా ప్రజలు నుండి వినతులు స్వీకరించి, కొన్నిటికి సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ ,గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్రంలో ఉన్న వెటర్నరీ పోస్టుల భర్తీ చేయాలని,దీనిని ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దష్టికి తీసుకెళ్లారు.అదేవిధముగా సయ్యద్ కాషిఫా అనే బాలిక శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతూ, మంచానికే పరిమితం అయ్యిందని తమకు కుమార్తెకు పెన్షన్ ను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరగా త్వరలోనే పెన్షన్ మంజూరుకు కషిచేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామినిచ్చారు.



త్వరలో ఎయిమ్స్‌లో పూర్తిస్థాయిలో సేవలు

ప్రజాశక్తి మంగళగిరి

భారత ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర సోమవారం మంగళగిరి ఎయిమ్స్‌ని సందర్శించారు. ఇనిస్ట్యూట్ యొక్క పది స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎయిమ్స్ లో కొన్ని విభాగాలను ప్రారంభించారు. జన ఔషధ కేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్, రెండవ ఎం ఆర్ ఐ డిజిటల్ సబ్ట్రాక్షన్ యాంజియోగ్రఫీ ల్యాబ్, ఎయిమ్స్ మంగళగిరి స్మార్ట్ కార్డ్ ఈ పేమెంట్ సిస్టం, కంట్రోల్ రూమ్, సెంట్రల్ స్టరైల్ సప్లై డిపార్ట్మెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ అతుల్ గోయెల్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, జైదీప్ కుమార్ మిశ్రా, మంగళగిరి డాక్టర్ మధబానంద కర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, నగర కమిషనర్ వ్యక్తిగత సెలవులో ఉన్నప్పుడు ఆయా



మాట్లాడుతున్న కమిషనర్

విభాగాధిపతులు తమ విభాగ పనితీరు పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని నగర కమిషనర్ కీర్తి చేకూరి జిఎంసి విభాగాధిపతులపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం నుండి ఇవ్వాల్సిన అనుమతులు, విభాగాల వారీగా పెండింగ్ ఫైల్స్‌పై కమిషనర్ అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జీతాలు తీసుకునే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్.ఈ. శ్యాంసుందర్, సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ పద్మజ తదితరులు

కెఇఎస్ విద్యార్థినిలకు మెరిట్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వర లోని కే ఈ ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న 9మంది మెరిట్ విద్యార్థినీలకు ఆల్ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ ఒక్కొక్క విద్యార్థినికి రూ.50 వేలు చొప్పున అందజేసింది. సోమవారం స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ పద్మజావాణి అభినందించారు. విద్యార్థులు టెక్నికల్ రంగంలో రాణిస్తూ, చదువుతున్న కళాశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ చట్టం నిబంధనలు పాటించాలి

ఉద్యాన శాఖాధికారి ఎన్.సురేష్

ప్రజాశక్తి-విజయపురిసౌత్



నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మాచర్ల ఉద్యాన అధికారి యన్.సురేష్ అన్నారు. మండాదిలో ఉన్న షేడ్ నెట్ నర్స రీలను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్టుతో రక్షణ కల్పించాలన్నారు. నర్సరీ లైసెన్సు లేని ప్రతి ఒక్కరు లైసెన్స్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసు కోవాలన్నారు. కొత్తగా షేడ్ నెట్ నర్సరీలు వేసిన వారు కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలన్నారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీల యజమానులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులకు నాసిరకం నారు అందించే, అధిక ధరలకు విక్రయించే నర్సరీలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా మిరప నారును విక్రయించే నర్సరీలపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా వారు లైసెన్స్ లేని నర్సరీలకు ,రిజిస్టర్లు లేని నర్సరీలకు నోటీసులు అందజేశారు.



రాయితీపై కందిపప్పు, బియ్యం అమ్మకాల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మాచర్ల

రాయితీపై ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పాటు చేసిన కంది పప్పు, బియ్యం అమ్మకాల కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక శ్రీ కోదండరామాలయం ఆవరణలో డాల్ మిల్లర్స్, రైసు మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయితీపై కందిపప్పు, బియ్యం అమ్మకాల కేంద్రాన్ని తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి ఎంపిడిఓ సరోజినీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ 160, బియ్యం రూ.49 , రూ.48 కు మిల్లర్లు అమ్మకాలు నిర్వహిస్తారని వివరించారు.

వాహన చోదకులకు న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వల్లెల గార్డెన్స్‌లో ద్విచక్ర వాహన చోదకులకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార స్వామి మాట్లాడుతూ వాహన చోదకులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని చెబుతూ ప్రచారం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలగురించి వివరించారు. వాహనదారులకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని అన్నారు.

విద్యా సామాగ్రి పంపిణి

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలంలోని వంకాయలపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. బోయపాలెం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త వడ్డేపల్లి శివ నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్ఎం జె రవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దాత శివ నాగేశ్వరరావు మాట్లాడారు.

తొలి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమీక్ష సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ఈ నెల 17న తొలి ఏకాదశి నేపథ్యంలో కోటప్పకొండకు వేలాదిగా తరలివచ్చే సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబులు ఆదేశించారు. సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో కోటప్పకొండలో తొలి ఏకాదశి వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏకాదశి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ప్రదక్షిణ మార్గం చదును చేయాలని మార్గం ఆద్యంతం తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వన్యమృగాల నుంచి భక్తులకు, ఆకతాయిల నుండి వన్య మగాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొండ పైనా, కింద అంబులెన్సులు, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పాము కాటు మందులు మెడికల్ క్యాంపులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వేడుకల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులకు, సందర్శకులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని, కొండపై వ్యాపారులతో మాట్లాడి పూజా సామగ్రి ధరలు అదుపులో ఉండేలా చూడాలన్నారు. అదే రోజున మొహర్రం వేడుకలు జరగనున్న నేపథ్యంలో మత సామరస్యం దెబ్బతినకుండా పోలీసు శాఖ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ప్రసాదంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు, పి.సరోజ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేష్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ సుబ్బారాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, తహశీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ భూమికి ఒక వరం

ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

ప్రజాశక్తి - క్రోసూరు



ప్రపంచ జనాభా దినోత్సవం పక్షోత్సవాలు పురస్కరించుకుని సోమవారం అనంతవరంలో జనాభా దినోత్సవంపై ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ జనాభా నియంత్రణ భూమికి ఒక వరం అన్నారు . వైద్య ఆరోగ్యశాఖ తరపున ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన నినాదంతో ప్రజల్లో జనాభా పెరుగుదలతో ముడిపడి ఉన్న ఆరోగ్యం, ఆర్థికం, పునరుత్పత్తి, పర్యావరణం మొదలైన వాటిపై కలిగే ప్రతికూల అంశాలను చర్చించుటకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ,బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం అనే నినాదం ప్రతిపాదించి ప్రజలలో అవగాహన కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జూన్ 27 నుండి జూలై 24 వ తేదీ వరకు నెల రోజులు పాటు రెండు పక్షోత్సవాలుగా విభజింపబడి నిర్వ హించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త డివి పద్మావతి ఉపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ తప్పిదాలతో తాగునీటికి ఇబ్బంది

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శ

ప్రజాశక్తి-చిలకలూరిపేట



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

గడచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన పాపాలే తాగునీటి సరఫరా విషయంలో శాపాలై ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక పండరీపురంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కీలకమైన తాగునీటి ప్రాజెక్టులను పడకేయించడం, కనీసం నీటి నాణ్యత పరీక్షలను పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు సమస్యలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నా యన్నారు. ఎన్టీఆర్ సుజల పథకం, పట్టణానికి తాగునీరు అందించే పాత చెరువు, కొత్త చెరువును ఆయన పరిశీలించారు. చెరువుల్లో జలాలు రోజురోజుకు తగ్గు ముఖం పడుతుండడం, ఉన్న అరకొర నీరు కాస్త రంగుమారి కలుషితంగా ఉండడంతో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం చెరువుల్లో ఉన్న నీరు 23 రోజుల లోపు అవసరాలకే సరిపోతాయని, ఆలోగా ప్రత్యామ్నాయాలు కూడా అన్వే షించాలన్నారు. చిలకలూరిపేట ప్రజలకు మరో 45 రోజులు నీటి కష్టాలు తప్పవని, ఉన్నంతలో మెరుగ్గా నీటి సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. చెరువు నీటి విషయమై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడామన్నారు. సాగర్ కుడికాల్వ ద్వారా 5 టీఎంసీలు విడుదల చేసి ముందుగా తాగునీటికి ఇవ్వాలని, చిలకలూరిపేట, వినుకొండతోపాటు నీటి కొరత ఉన్న ప్రాంతాలకు సరఫరా చేయాలని కోరినట్లు చెప్పారు. చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అమృత్ పథకాన్ని పూర్తి చేస్తే చిలకలూరిపేటకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు.



రెజ్లింగ్ క్రీడాకారిణికి సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రెజ్లింగ్ జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారిణి గుర్రం నీతిశను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం అభినందించి, సత్కరించారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకి చెందిన నీతిశ , తమిళనాడు రెస్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఫస్ట్ సౌత్ ఇండియా అండర్ -23 పోటీలలో జాతీయ స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ సాధించింది. కోచ్ మనోహర్ తల్లిదండ్రులు గుర్రం రామాంజనేయులు, యశోద పాల్గొన్నారు.

ఎస్పీగా కె.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠికి మొక్కను బహూకరిస్తున్న ఎస్పీ

పల్నాడు జిల్లా ఎస్పీగా కె. శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం తెల్లవారు జామున కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కలను బహూకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ చరిత్రాత్మక పల్నాడు జిల్లా ఎస్పీగా రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఎన్నికల సమ యంలో అనేక సమస్యలు వచ్చాయని గత ఎస్పీ మల్లికా గర్గ్ సమర్థవంతంగా పరిష్కారించారన్నారు. జిల్లాలోని పరి స్థితులను అవగాహన చేసుకుని చట్టపరంగా అన్ని సమస్యలు పరిష్కరిస్తానన్నారు. చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుడు కేసులు బనాయించ కుండా బాధితునికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, ముఖ్యంగా జిల్లాలో మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యాంటీ డ్రగ్స్ పై జిల్లాలో 100 రోజుల పాటు గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, ప్రజల సేవ కోసం పల్నాడు పోలీసులు సిద్ధంగా ఉంటారన్నారు.

కార్యకర్తల కష్టానికి గౌరవం,గుర్తింపు

ఎమ్మెల్యే యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

గడిచిన ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిని ప్రతి కార్యకర్త కష్టానికి గౌరవం,గుర్తింపు ఇస్తాననిగురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక వల్లెల గార్డెన్స్‌లో టిడిపి,జనసేన,బిజెపి సమీక్ష సమావేశం నిర్విహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు అవమానాలు పడ్డ కార్యకర్తలు,నాయకుల గౌరవాన్ని నిలబెడతానని రాజకీయంగా,ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. గెలిచాక మాకు ఎటువంటి పనులు జరగడం లేదని ఎవ్వరూ నిరూత్సాహపడవద్దని అందరిని గుర్తుపెట్టుకుంటామని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. పిడుగురాళ్ళలో డయేరియా ప్రభావం ఉందని, డయేరియాను 100 శాతం నిర్మూ లించాలని అన్నారు.

మోడీ పాలనలో ప్రతిరోజూ రాజ్యాంగ హత్యా దినమే

రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం రాధాకృష్ణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి యాభై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 25వ తేదీని రాజ్యాంగ హత్యా దినంగా బిజెపి ప్రభుత్వం ప్రకటించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం రాధాకృష్ణ తీవ్రంగా విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పదేళ్ల పాలనా కాలంలో ప్రతి దినం రాజ్యాంగ హత్యా దినమేనని, ఇంకా ప్రత్యేకంగా జూన్ 25న రాజ్యాంగ హత్యాదినంగా ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఎన్డీఏ పాలనపై ప్రజలకు విరక్తి కలిగింది అనడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ నెలలో ప్రకటించిన ఏడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ఘోరంగా ఓడిపోవడమేనని నన్నారు. ఇప్పటికైనా బిజెపి నాయకులు, పాలకులు ఇలాంటి దురాలోచనలు మానుకోవాలని హితవు పలికారు.

రాయవరంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మాచర్ల



సీజనల్ వ్యాధుల పట్ల ముం దస్తు చర్యలలో భాగంగా మండల పరిధిలోని రాయవరంలో సోమ వారం మురుగు కాలువలు శుభ్రపర్చి, కాలువల పక్కన రహదారికి ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. ఎంపిడిఓ సరోజినిదేవి గ్రామాల్లో ప్రచారం చేయిస్తున్నారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగితే మంచిదని ప్రజలకు సూచించారు.



జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన అంబటి మురళీకృష్ణ తదితరులు

వైసిపి కార్యకర్తలపై టిడిపి దాడులు

ప్రజాశక్తి - పొన్నూరు

వైసిపి కార్యకర్తలపై టిడిపి నేతల దాష్టికాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని పొన్నూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ అంబటి మురళీకృష్ణ, నియోజకవర్గ వైసిపి ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాజర్ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నివాస గృహంలో మర్యాదపూర్వకంగా అంబటి మురళీకృష్ణ కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కాగా ముస్లిం మైనార్టీ నేత షేక్ నాజర్ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి మహమ్మద్ ప్రవక్త జీవిత గ్రంథమును బహుకరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి స్పందిస్తూ ఇక ముందు వైసీపీ కార్యకర్తలపై అక్రమంగా, దౌర్జన్యాలు చేసి దాష్టికాలకు దిగితే సహించేది లేదని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అవసరమైతే న్యాయ స్థానాన్ని ఆశ్రయించి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించడం జరిగిందని అంబటి మురళి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ భవనం పద్మలీల, జడ్పిటిసి కె. రమేష్, వైసీపీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, బొనిగల వేణు ప్రసాద్ పాల్గొన్నారు.



ఎస్ ఎల్ ఎం చైతన్య హైస్కూల్లో పోస్టర్ ఆవిష్కరణ

10, 11తేదీల్లో టీచర్లకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి మంగళగిరి : స్టెప్ ఆధ్వర్యంలో ఆగస్టు 10,11 తేదీలలో తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా స్టెప్ వ్యవస్థాపకులు డాక్టర్ పి సుబ్బారావు తెలిపారు. మంగళగిరి పట్టణంలోని ఎస్ ఎల్ ఎం చైతన్య హైస్కూల్లో సోమవారం ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులే వ్యక్తిత్వ వికాస మార్గదర్శకులని అన్నారు. విద్యార్థుల్లో వస్తున్న మానసిక సమస్యలను పరిష్కరించే శక్తి ఉపాధ్యాయులకు ఉందని అందువలన వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్ బాలకృష్ణ, స్టెప్ ప్రిన్సిపల్ బి కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు ఏం వేణుగోపాలరావు, స్టెప్ నాయకులు ఎస్ చందు, పి పిచ్చియా, ఎస్ ప్రసాద్, ఎస్ భాస్కర్ పాల్గొన్నారు.

కేసన శంకర్రావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి :రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన్న శంకర్రావు జన్మదిన వేడుకలు సోమవారం మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కే శివరాం బాబాజీ, దాన గౌడ్, జయలక్ష్మి, టి కిరణ్, యు శ్రీనివాసరావు, ఐ నగేష్ పాల్గొన్నారు.



కేసన పుట్టినరోజు వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కోనోకార్పస్ మొక్కల తొలిగింపుపై వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ప్రకృతిలో విషవాయులను విరజిమ్మే కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి హాని కలిగిస్తూ, సమస్త జీవకోటికి ప్రాణాంతకంగా మారుతున్నాయని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ అన్నారు. ప్రకృతికి హాని తలపెట్టే విషజాతి మొక్కలను వెంటనే తొలిగించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో కమిషనర్ బి శేషన్న కు వినతిపత్రం అందజేశారు. కోనోకార్పస్ మొక్క రాక్షసజాతికి చెందిన చెట్టుగా శాస్త్రవేత్తలు జరిపిన పలు



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సత్యం, శివం, సుందరం వ్యవస్థాపకులు

అధ్యయనాల్లో వెల్లడయ్యిందని పేర్కొన్నారు. పర్యా వరణానికి ముప్పు కలిగిస్తున్న మొక్కలు తొలగించకపోతే ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారినపడే ప్రమాదంతోపాటు భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి నెలకుంటుందని వక్ష శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. సమర్పించిన వినతిపై కమిషనర్ స్పందిస్తూ ఈ విషయంపై అధికా రులతో చర్చి ంచి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలియ చేసారన్నారు. కార్యక్రమంలో కేంద్రం సభ్యులు మాలేపాటి హేమ కుమార్, చుక్కా భాను ప్రసాద్ పాల్గొన్నారు.

అవయవ దాత ప్రసాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి మంగళగిరి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యి అవయవదానం చేసిన అమరజీవి మునగపాటి ప్రసాద్‌కి మానవతా వేదిక ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని ప్రసాద్ నివాసం వద్ద జరిగిన సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. తొలుత మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయ రావు స్వాగతం పలుకగా మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు సభకు అధ్యక్షత వహించారు. జాతీయ శరీర అవయవదాన సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతా మహాలక్ష్మి పాల్గొని ప్రసంగిస్తూ భర్తను కోల్పోయి కూడా మునగపాటి ప్రసాద్ భార్య సంధ్యా రాణి అవయవాదానానికి ముందుకు రావడం స్ఫూర్తిదాయకం అని, చిన్న వయసులోనే పెద్ద మనసుతో వ్యవహరించిన సంధ్యారాణి ఎందరికో ఆదర్శం అన్నారు. సంధ్యారాణి కుటుంబానికి తమ వంతు సాయంగా సావిత్రిబాయి పూలే ట్రస్ట్ ద్వారా రూ.20వేలు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ 52000 వేల మంది అవయవదానం చేశారనీ, కానీ ఇలా పెద్ద ఎత్తున సంస్మరణ సభ నిర్వహించడం మంగళగిరిలోనే తొలిసారి చూస్తున్నానని అన్నారు. సంధ్యారాణికి అవుట్



మునగపాటి ప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు

సోర్సింగ్ లో ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి స్థానిక శాసనసభ్యులు, ఐటి మంత్రి నారా లోకేష్ కి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా అవయవదానం సంఘ కో ఆర్డినేటర్‌గా ఎంపికైన రేకా నర్మద మాట్లాడుతూ అవయవదానం పట్ల అవగాహన పెంపొంచేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జున రావు ప్రసం గిస్తూ అవయవదానం పట్ల అవగాహన పెంచేందుకు మానవతా వేదిక ముందుకురావడం మంచి పరిణామం అన్నారు. సభలో ఎన్.ఆర్. ఐ వైద్యులు షేక్ ఆరిఫ్ మస్తాన్,ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, నిర్మలా ఫార్మసీ కళాశాల ఎన్ .ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ రేకా నరేష్ బాబు ,చిలకా వేంకటేశ్వర రావు,అందే వేంకటేశ్వర రావు, కంచర్ల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి తెనాలి

స్థానిక బాలాజీరావు పేట భవిత కేంద్రంలో పట్టణానికి చెందిన ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరుగురు విద్యార్థులకు వినికిడి యంత్రాలను సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థుల వినికిడి సామర్థ్యం పరిశీలించి యంత్రాలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు తారా కుమార్, శశాంక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల విద్యాధికారులు డాక్టర్ ఎం లక్ష్మీనారాయణ, వి జయంతిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని సంస్థ సేవ లను అభినందించారు. కార్యక్రమంలో ఆడియాలజిస్ట్ త్రివి క్రమ్, ప్రధానో




వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాధ్యాయులు నందకుమార్, సిఆర్పి శ్యామ్, ఐఈఆర్టి ఉపాధ్యాయులు వై రజనీ కుమారి, డి సునీత, సిబ్బంది జయమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ చంద్రమౌళి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పొన్నూరు



నైతిక విలువలతో కూడిన రాజకీయాలకు పెద్దపీట వేసిన ప్రముఖ సీనియర్ వైద్యులు, గోల్డ్ మెడలిస్ట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సజ్జ చంద్రమౌళి విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో బహుముఖ సేవలు అందించి, ప్రజా వైద్యునిగా ప్రజల మనసును గెలుచుకున్నారని స్థానిక మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, డాక్టర్ చంద్రమౌళి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ సజ్జ హేమలత ప్రశంసించారు. ప్రముఖ సీనియర్ వైద్యులు, మాజీ ఎమ్మెల్యే దివంగత డాక్టర్ సజ్జ చంద్రమౌళి 97 జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం డాక్టర్ చంద్రమౌళి ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆరే వెంకట్రావు అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ హేమలత మాట్లాడుతూ డాక్టర్ చంద్రమౌళి పొన్నూరు, చీరాల ప్రాంతాలలో వైద్యరంగంలో ఎనలేని సేవలందించారన్నారు. డాక్టర్ చంద్రమౌళి ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ సజ్జ రవీంద్రబాబు మాట్లాడుతూ వైద్య రంగంలో తనదైన ముద్ర వేసుకుని ప్రజలకు వైద్య సేవలు అందించి ప్రజా వైద్యునిగా ఈ ప్రాంత ప్రజలలో పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ హేమలత దంపతులు కేకును కట్ చేశారు. అనంతరం జి బి సి రోడ్డు డివైడర్ పై ఏర్పాటుచేసిన డాక్టర్ సజ్జ చంద్రమౌళి విగ్రహానికి డాక్టర్ రవీంద్రబాబు, డాక్టర్ హేమలతతో పాటు, స్థానిక ప్రముఖ వైద్యులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో మాదాల వెంకటేశ్వరరావు, గోగినేని పరశురామయ్య, ఆరేటి రామారావు, పూల సుబ్రహ్మణ్యం, ఆరే వెంకట్రావు, గోవాడ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.





విజయవంతంగా కేన్సర్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-మంగళగిరి

సర్వేకల్ క్యాన్సర్‌తో మరణించే వారి సంఖ్య భారతదేశంలో 25 శాతంగా ఉందని క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రొటేరియన్ రూపరాజ్ అన్నారు. క్యాన్సర్ మొదటి దశలోనే గుర్తించి చికిత్స పొందడం వల్ల నేను మీ ముందు మాట్లాడుతున్నానని ఆమె తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చంద్ర చౌదరి ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి వీవర్స్ కాలనీ లోని మున్సిపల్ హై స్కూల్ ప్రాంగణంలో 9 నుండి 14 సంవత్సరాల బాలికలకు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందే మురళీమోహన్ పి డి జి అన్నే రత్న ప్రభాకర్ రోటరీ క్లబ్ ట్రైనర్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, మాజేటి వంశీకష్ణ, వేదాంతి హాస్పిటల్ అంకాలజిస్ట్ డాక్టర్ మహంతి, యూఎస్ఏ రోటోరియన్ రూపా రాజ్ డాక్టర్ అనూష,సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ దేశాలు, భారతదేశంతో కలుపుకొని భయంకరమైన సర్వేకల్ క్యాన్సర్.2, 25 శాతం గా నమోదైనట్లు తెలిపారు. మనదేశంలోని మహిళలకు సర్వేకల్ క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ బాలికలకు వ్యాక్సినేషన్ ఇచ్చి భావితరాల భవిష్యత్తు కల్పించటమే రోటరీ క్లబ్ యొక్క లక్ష్యం అని స్పష్టం చేశారు. మంగళగిరిలో ప్రారంభించిన వాక్సినేషన్ ప్రాజెక్ట్ రోటరీ రానున్న రోజుల్లో సర్వేకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని వారు స్పష్టం చేశారు. మొదటి డోసు వేసామని ఆరు నెలల తర్వాత రెండో డోస్ కూడా వేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను కమిటీ సభ్యులను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. రో రోటరీ క్లబ్ చేసే సేవలకు తను సహాయంగా అండగా ఉంటానని అన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి దుగ్గిరాల

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలనికోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పేరుకలపూడి పెద్దపాలెం చిలువూరు గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేశారు. సంతకాలసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతుల రక్షణ కోసం 2011 భూ అధికృత చట్టాన్ని అమలు చేయాలన్నారు. కౌలు రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నారని అందువలన అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేసి రూ.20వేల నగదు అందించాలన్నారు. సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర బాబు కె శ్రీనివాసరావు విజయలక్ష్మి చంద్రశేఖర రావు రామ్ చరణ్ దావీదు రామారావు అంజయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి మంగళగిరి



కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్లు అద్వానంగా ఉన్నాయని నిర్మాణం చేయాలని, మురుగు నీరుపారుదలకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె ఈశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సుమేధా విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా స్థాయి బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-11 గరల్స్ విభాగం, సింగిల్స్, డబుల్స్ విభాగంలో ప్రధమ స్థానం సాధించిన సుమేధా హైస్కూల్ విద్యార్థి సంకట సాయి అక్షరను స్కూల్ డైరెక్టర్ మున్న ంగి చంద్రశేఖర్‌రెడ్డి అభినంది ంచారు. ఈనెల 13, 14 తేదీల్లో తాడేపల్లిలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో సాయి అక్షర ప్రధమ స్థానంలో సాధించటం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ రాంబాబు, పిఇటి కిరణ్‌రెడ్డి, విద్యార్థి తల్లిదండ్రులు సంకటి దుశ్యంత్‌రెడ్డి, ప్రశాంతి, తాత గుజ్జుల జయరామిరెడ్డి పాల్గొన్నారు.



సాయి అక్షరతో మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు



వివా విద్యార్థులకు ఐబిఎమ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి- తెనాలి

అధునాతన సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు ప్రఖ్యాత ఐ.బి.ఎమ్ (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్ కార్పొరేషన్) భాగస్వామ్యంతో ఎడ్యునెట్ ఫౌండేషన్ నిర్వహించే డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫారం "ఐ.బి.ఎమ్ స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్' ను నంబూరు వివా ది స్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఎడ్యుటెక్ శిక్షణాధికారి అశ్విన్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లడుతూ ఐ.బి.ఎమ్ స్కిల్ బిల్డ్ ప్రోగ్రామ్ విద్యార్థులలో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు మంచి వేదిక అన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా కమ్యూనికేషన్, ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కారం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చన్నారు. ప్లస్ 1, ప్లస్2 విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతిక అంశాలలో, 5 నుండి 12వ తరగతి విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో శిక్షణ ఉంటుందని, స్కూల్ తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా సంవత్సరకాలం పాటు డిజిటల్ శిక్షణను అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్టి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సిహెచ్. సరళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో పారిశుధ్యం పై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ హెచ్చరించారు. మంగళవారం నుండి నగరంలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా కమిషనర్ తొలుత గత సోమవారం ఫిర్యాదుల పరిష్కారంపై విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. తర్వాత కమిషనర్ ప్రజల నుండి వివిధ విభాగాలకు సంబంధించిన 79 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి పలు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటేషన్ కార్యదర్శులు, శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమన్వయం చేసుకొని మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై సిఎంఓహెచ్‌ని వివరాలు అడిగి, సమాధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్యం కీలకమని, అటువంటి పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించనని, భాధ్యులైన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఈ శ్యాంసుందర్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలం జీతం ఇవ్వాలి..

జిఎంసి పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు 2023 డిసెంబర్‌లో జరిగిన సమ్మెకాలం జీతం వెంటనే చెల్లించాలని, పండగ కానుక వెయ్యి రూపాయలు చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు కోరారు. సోమవారం జిఎంసి గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు అర్జీ అందజేశారు. సమ్మెకాలం జీతం, పండుగ కానుక వెయ్యి రూపాయలు ఇవ్వటానికి ప్రభుత్వం అంగీకారం తెలిపినా,



జిఎంసి పరిధిలో కార్మికులకు ఇంతవరకు సమ్మె కాలం జీతం, పండగ కానుక చెల్లించలేదన్నారు. కావున వెంటనే చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వివిధ శానిటరీ డివిజన్‌లలో పనిచేస్తున్న బదిలీ కార్మికులను నగరంలో తక్కువ కార్మికులు ఉన్న శానిటరీ డివిజన్‌లలో పని కల్పించాలని కోరారు. గాంధీపార్క్, వాటర్‌వర్క్స్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని కోరారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 230 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు, డిఆర్ఓ పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీఖర్, డీఆర్డీఏ , డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్ , పి.ఉమా దేవి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 230 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటి సిఈఓ మోహన్‌రావు, డియంఅండ్‌హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి , డిసిఓ వీరాచారి, ఎస్.ఈ పంచాయితీరాజ్ గుర్రం బ్రహ్మయ్య , సిపిఓ శేషశ్రీ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి మధుసూధన్, డిఈఓ శైలజ తదితరులు ఉన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, అధికారులు

యానిమేటర్లు, ఆర్‌పిలపై వేధింపులు ఆపాలి



యానిమేటర్లు, ఆర్‌పిలపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యానిమేటర్లు, ఆర్‌పిలపై తక్షణమే రాజకీయ వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు ఐదు సంవత్సరాలకు ఒకసారి పార్టీలు మారుతూ నిరంతరం ప్రజల కోసం పనిచేసే యానిమేటర్లు, ఆర్‌పిలపై రాజకీయముద్రలు వేయటం తగదన్నారు. వేధింపులు ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఎన్నికల్లో గెలిపించి, నా ఆత్మ గౌరవాన్ని పెంపొందించారని అందుకు కృతజ్ఞతగా ఉంటానని చంద్రబాబు చెప్పిన కొన్ని రోజులు కూడా గడవకముందే గ్రామాల్లో, పట్టణాల్లో చిరుద్యోగులపై చోటా నాయకులు ప్రతాపం చూపిస్తున్నారని అన్నారు. దానికి అధికారులు కూడా వంత పాడుతూ మానసిక ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. ఆర్‌పిల యూనియన్ జిల్లా అధ్యక్షులు అచ్చమాంబ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలో ఆర్‌పిలపై వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దెబోర మాట్లాడుతూ తాడికొండ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో ఈ వేధింపులు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమాదేవి, విజయలక్ష్మి, శివకుమారి, పద్మా పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌ను పొడిగించాలి

గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు కేటాయించాలని రైతు సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సుమారు 50 గ్రామాల ప్రజలకు తాగునీరు, 50వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని సుదీర్ఘకాలంలో రైతులు, ప్రజలు ఆందోళనలు చేస్తున్నారని, ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలులోకి రావట్లేదన్నారు. గత సంవత్సరం తాగునీటి ఇబ్బందితో ప్రజలు అనేక ఇక్కట్లు పాలయ్యారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధులు విడుదల చేసి, పనులు చేపట్టాలన్నారు. కీలకమైన ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర, ఇంటూరి చంద్రశేఖర్ ఉన్నారు.



టిడిపి అధికారంలోకి రాగానే పెన్షన్లు ఆపేశారు..

నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమకు పెన్షన్లు నిలిపివేశారని కాకుమాను మండలం, గరికపాడుకు చెందిన లబ్దిదారులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి తాము పెన్షన్ తీసుకుంటున్నామని, కానీ ఈనెలలో పింఛన్లు ఇవ్వలేదన్నారు. గ్రామ సభలో సామాజిక తనిఖీ వారి సమక్షంలో ఫిర్యాదు ఇచ్చారనే పేరుతో, తమ పింఛన్లు పున: పరిశీలించాలని నిలిపివేశారన్నారు. వికలాంగులు, మత్స్యకారులు, వృద్ధాప్య పింఛన్లు మొత్తం 11 నిలిపివేశారని, తాము అధికార పార్టీకి ఓటు వేయలేదని పింఛన్ నిలిపివేశారని తెలిపారు. అర్జీ ఇచ్చిన వారిలో ప్రత్తిపాటి పిచ్చయ్య, కొచ్చర్ల నాగేశ్వరరావు, వరదల లాజరు, జ్యోతిరాజు ఉన్నారు.



తెలుగు మాస్టార్‌ను మార్చాలి

తెనాలి మండలం, పెదరావూరు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును తొలగించి వేరొకర్ని నియమించాలని 9వ తరగతి విద్యార్థినులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు సరిగా బోధించట్లేదని, పాఠాలు అర్థం కావట్లేదన్నారు. ఎఫ్ఎ-1 సిలబస్ కూడా అడిగితేగానీ చెప్పలేదన్నారు. తాము అడిగిన పాఠాలే చెబుతున్నారని, ఒక వరుస క్రమంలో కూడా చెప్పట్లేదన్నారు. ఈ విషయంపై తమ తరగతికి వచ్చిన హెచ్ఎంకు ఫిర్యాదు చేసినా కూర్చోండని చెప్పార న్నారు. ఇదే విధంగా పాఠాలు చెబితే పదో తరగతిలో తాము ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. కావున తెలుగు మాస్టారును మార్చాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో బి.అవంతిక, యాస్మిన్ తదితరులున్నారు.



పార్ట్‌టైమ్ అధ్యాపకుల్ని రెగ్యులర్ చేయాలి

ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల్ని రెగ్యులర్ చేయాలని ఎపి ఎయిడెడ్ కాలేజెస్ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జోషిరావు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. జిఒ 35 వల్ల ఎయిడెడ్ కాలేజిల్లో పోస్టుల భర్తీ నిలిచిపోయిందన్నారు. పార్ట్‌టైమ్ లెక్చరర్ల తోనే బోధన చేయిస్తున్నా రన్నారు. ఉద్యోగ భద్రత లేక ఏళ్ల తరబడి పార్ట్‌టైమ్ లెక్చరర్లు పనిచేస్తున్నారన్నారు. కావున రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని, లేదంటే కనీసం కాంట్రాక్ట్ అధ్యాపకుల మాదిరిగా ఎంటిఎస్ ఇవ్వాలని కోరారు.